సీటొస్తే బంగారు భవిష్యత్

- స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతి ప్రవేశ షెడ్యూల్ విడుదల
- మూడు స్థాయిల్లో ఎంపికలు
- పిల్లలతో క్రీడాసాధన చేయిస్తున్న తల్లిదండ్రులు


క్రీడా పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

డోర్నకల్: మేడ్చెల్ జిల్లా హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ రీజనల్ స్పోర్ట్స్ పాఠశాలల్లో 4వ తరగతిలో ప్రవేశాలకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఇటీవల షెడ్యూల్ విడుదల చేసింది. దీంతో క్రీడలపై ఆసక్తి ఉన్న తల్లిదండ్రులు తమ పిల్లలను స్పోర్ట్స్ స్కూల్‌లో చేర్పించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. పిల్లలతో ఉదయం సాయంత్రం మైదానాల్లో క్రీడాసాధన చేయిస్తున్నారు. స్పోర్ట్స్ పాఠశాలల్లో ప్రవేశం లభిస్తే 4వ తరగతి నుంచి ఇంటర్ సెకండియర్ వరకు హాస్టల్ వసతితో ఉచిత విద్యతోపాటు క్రీడల్లో శిక్షణ ఇస్తారు.

పలు క్రీడల్లో శిక్షణ

హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూళ్లలో అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, వీలు విద్య, రోయింగ్, సెయిలింగ్, వెయిట్‌లిఫ్టింగ్, జూడో, వాలీబాల్, బాక్సింగ్, రెజ్లింగ్ క్రీడల్లో శిక్షణ ఇస్తారు. ప్రతి రోజు ఉదయం 6గంటల నుంచి 8.30 గంటల వరకు, సాయంత్రం 4.30గంటల నుంచి 6.30 గంటల వరకు క్రీడల్లో శిక్షణ ఉంటుంది. మధ్యాహ్నం పాఠశాలకు వెళ్లి విద్యనభ్యసించాల్సి ఉంటుంది. విద్యార్థుల ఆరోగ్యం, ఎదుగుదలను దృష్టిలో ఉంచుకుని క్యాలరీలు సమపాలల్లో అందేలా కోడిగుడ్లు, మాంసాహారం, పండ్లు, పాలు అందిస్తున్నారు.

ఎంపిక విధానం..

మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో అర్హతా పరీక్షలు నిర్వహించి స్పోర్ట్స్ స్కూల్‌కు విద్యార్థులను ఎంపిక చేస్తున్నారు. మండలస్థాయిలో జూన్ 21 నుంచి 25వ తేదీ వరకు, జిల్లాస్థాయిలో 27వ తేదీ నుంచి 30వరకు, రాష్ట్రస్థాయిలో జులై 8నుంచి 12 వరకు ఎంపికలు చేస్తారు. జూలై 22 నుంచి 27 వరకు అసెస్‌మెంట్ శిబిరాలు నిర్వహించి ఆగస్టు 5న అడ్మిషన్లు పూర్తి చేస్తారు. 4వ తరగతిలో ప్రవేశానికి 2015 సెప్టెంబర్ 1నుంచి 2016 ఆగస్టు 31లోపు జన్మించిన వారు అర్హులు. ఎంపిక శిబిరాల్లో ఎత్తు, బరువు, 30మీటర్ల ఫ్లైయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్ల పరుగు, 6''4 మీటర్ల షటల్ జంప్, మెడికల్ పరీక్షలు నిర్వహిస్తారు.

అన్నివిధాలా ప్రోత్సహిస్తున్నాం..



స్పోర్ట్స్ స్కూల్‌లో సీటొస్తే బంగారు భవిష్యత్ పొందే అవకాశాలు ఉంటాయి. ఇప్పటికే మహబూబాబాద్, డోర్నకల్ తదితర ప్రాంతాల్లో స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశం పొంది క్రీడల్లో రాణించి ఉద్యోగాలు పొందారు. స్పోర్ట్స్ స్కూల్‌లో చేరాలనుకునే వారిని అన్నివిధాలుగా ప్రోత్సహిస్తున్నాం.

- సుధాకర్, క్రీడాకారుడు

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తాం

- ఎమ్మెల్యే యశస్విని‌రెడ్డి


నోటు బుక్స్ అందిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు రూరల్: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని హరిపిరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ విద్య బలోపేతం అవుతుందన్నారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో త్వరలో విద్యా కమిషన్ ఏర్పాటు కానుందన్నారు. అంతకు ముందు తొర్రూరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాదాబైనామా దరఖాస్తులను పరిశీలించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గార్ల: మండలంలో పెండింగ్‌లో ఉన్న రైతుల సాదాబైనామా దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు వచ్చేలా కృషి చేయాలని కోరుతూ టీజీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బి.హరినాయక్ శనివారం తహసీల్దార్ కె.రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలో అనేక మంది రైతుల భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు లేక రైతుబంధు పథకంను కోల్పోతున్నారన్నారు. ఇట్టి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాదాబైనామా దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ పట్టాలు ఇప్పించేలా చర్య చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శాంతికుమార్, అజ్మీర వెంకన్న, సాయిరాం, శ్రీనివాస్, రమేష్, యాదయ్య, పూల్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మున్సిపల్ కార్మికులను పర్మనెంట్ చేయాలి



మహబూబాబాద్: మున్సిపల్ కార్మికులను పర్మనెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు తోట శ్రీనివాస్, యూనియన్ జిల్లా కార్యదర్శి కాంపెల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశాడు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా చేసి కమిషనర్ నోముల రవీందర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కృష్ణ, శ్రీను, విజయ్, ఎల్లయ్య, వెంకన్న, రజినికుమార్, పుష్పరాజ్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మహబూబాబాద్: మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబాలు బాగుపడుతాయని సీపీఎం మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సూర్నపు సోమయ్య అన్నారు. దైవ కృప వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక గుమ్ముడూర్ కమిటీ హాల్‌లో మహిళలకు కుట్టు మిషన్ కేంద్రం ఏర్పాటు చేయగా సూర్నపు సోమయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకుడు బానోత్ లోకేష్, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ నాగవాణి, వీరన్న పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మహబూబాబాద్ రూరల్: మండలంలోని అమనగల్ సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం మరమ్మతు కారణంగా అమనగల్, ఎక్స్‌ప్రెస్, శనిగపురం, వావిలాల, నర్సింహులగూడెం, గుండాల గడ్డ, బోరింగ్ తండా గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ భోజ్యానాయక్ శనివారం తెలిపారు.

ఇంటింటి సర్వేపై అవగాహన

నెల్లికుదురు/నెహ్రూసెంటర్: అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌పై ఇంటింటి సర్వేపై వైద్యారోగ్యశాఖ సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇంద్రానగర్, కృష్ణకాలనీ సబ్‌సెంటర్ల పరిధిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఒబిలిశెట్టి రామకృష్ణ మాట్లాడారు. ఇంటింటి సర్వే చేస్తున్న క్రమంలో ప్రతి ఒక్కరికీ బీసీజీ వ్యాక్సినేషన్ ఎందుకు వేస్తున్నామో వివరించాలని సూచించారు. సర్వేకు కావాల్సిన సామగ్రిని ఆశకార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రత్నకుమారి, హెల్త్ అసిస్టెంట్ రాజేందర్ పాల్గొన్నారు.

కుర్చీల బహూకరణ

మహబూబాబాద్ రూరల్: మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాటశాలలో పనిచేస్తున్న హిందీ ఉపాధ్యాయలు ఎనమనగండ్ల శ్రీధర్ తన తండ్రి, రిటైర్డు ఉపాధ్యాయలు ఎనమనగండ్ల మల్లేశం జ్ఞాపకార్థం శనివారం పాఠశాల అభివృద్ధికి రూ.10వేల విలువైన కుర్చీలు, రాకులను బహూకరించాడు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్ బాబు, ఉపాధ్యాయలు విష్ణువర్ధన్, ఉప్పలయ్య, శ్రీధర్ రెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వనభోజనాలు



మహబూబాబాద్ రూరల్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామంలో గ్రామస్తులంతా శనివారం వనభోజనాలకు తరలివెళ్లారు. ఊరికి దక్షిణాదిన కొండపై వెలసిన వేట వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని భక్తులు కొబ్బరికాయలు కొట్టి పులిహోర, కోళ్లు, మేకలతో మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో శంతన్ రామరాజు, కౌన్సిలర్ బానోత్ హరిసింగ్, సాగర్ రామరాజు, చిట్టిమల్ల శ్రీమన్, రామరాజు, రాథోడ్ పాల్గొన్నారు.

డబ్బులతో ఉడాయించిన వ్యాపారిని పట్టుకోవాలి



బయ్యారం: వ్యాపార అవసరాల నిమిత్తం డబ్బులు తీసుకొని ఉడాయించిన వ్యాపారి ఖైరంకొండ గణేశ్‌పై చర్య తీసుకోవాలని కోరుతూ శనివారం బయ్యారం బస్టాండ్ సెంటర్‌లో బాధితులు రాస్తారోకో నిర్వహించారు. అనేక సంవత్సరాలుగా వ్యాపారం నిర్వహిస్తుండటంతో నమ్మకంతో అప్పు ఇచ్చామని తమకు నమ్మకద్రోహం చేసి కుటుంబంతో పరారైన గణేశ్‌ను పట్టుకోవాలన్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై ఉపేందర్ ఆందోళన ప్రాంతానికి వచ్చి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి


రాస్తారోకో చేస్తున్న సంఘం నాయకులు

మహబూబాబాద్ రూరల్: నీట్ పరీక్షను రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల చరణ్ గౌడ్, సంఘం పట్టణ అధ్యక్షుడు బల్లెం చంటి అన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకై విద్యార్థులకు అన్యాయం జరిగిన నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ సెంటర్ రహదారిపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. నీట్ పరీక్షలో చోటుచేసుకున్న అక్రమాలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఉన్నతస్థాయి దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డోర్నకల్ అసెంబ్లీ అధ్యక్షుడు రమేష్ నాయక్, మహబూబాబాద్ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ చందు, టౌన్ వైస్ ప్రెసిడెంట్ సాయిరాజీవ్, కేసముద్రం మండల అధ్యక్షుడు తరుణ్ నాయక్, వైస్ ప్రెసిడెంట్ యశ్వంత్, నాయకులు సతీష్ నాయక్, భరత్, సాయికుమార్, విశ్వతేజ, అజయ్ కుమార్ పాల్గొన్నారు.

నెహ్రూసెంటర్: నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పాయం చంద్రన్న శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశాడు.

పోస్ట్‌మ్యాన్ అవినీతిపై విచారణ

నర్సింహులపేట: మండలంలోని కొమ్ములవంచ పోస్టాఫీస్‌లో పనిచేస్తున్న పోస్ట్‌మ్యాన్ అవినీతిపై శనివారం సంబంధిత ఉన్నతాధికారులు గ్రామంలో విచారణ జరిపారు. ఉపాధి హామీలో కూలీల డబ్బులు, పింఛన్ల డబ్బులు, ఆర్‌డీలు తదితర డబ్బులు సుమారుగా రూ.5లక్షల స్వాహాపై గ్రామస్తుల ఫిర్యాదు మేరకు శనివారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొర్రూరు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో విచారణ జరిపారు. గ్రామంలో ఖాతాదారులను పిలిపించుకొని వారి ఖాతాలను పరిశీలించారు. వారికి సంబంధించిన డబ్బుల వివరాలను అడిగారు. కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది బాలకృష్ణ, సైదులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ

కేసముద్రం: మండలంలోని నర్సింహులగుడెంజీపీలో గల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్, పలకలు, పెన్నులను పాఠశాల హెచ్‌ఎం కొడిపాక రమేష్ శనివారం అందజేశారు. హనుమకొండకు చెందిన మాజీ కార్పొరేటర్ తాడిశెట్టి విద్యాసాగర్ తన పుట్టినరోజు సందర్భంగా ఇట్టి సేవ కార్యక్రమానికి సామగ్రి అందించినట్లు హెచ్‌ఎం తెలిపారు.

గేదెను ఢీకొట్టిన ద్విచక్రవాహనం

- బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలు
- మృతి చెందిన గేదెను ఆటో ఢీ..
- సంఘటన చూసేందుకు వచ్చిన వ్యక్తిపైకి దూసుకెళ్లిన ఆటో
- గుజిలి తండావాసి పరిస్థితి విషమం


తీవ్రగాయాలైన జాటోత్ తులిస్యా

కురవి: గేదెను బైక్ ఢీకొట్టడంతో గేదె అక్కడికక్కడే మృతి చెందగా బైక్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలు కాగా మృతి చెందిన గేదెను మరో ఆటో ఢీకొట్టి పల్టీకొట్టి సంఘటనను చూసేందుకు వచ్చిన వ్యక్తులపైకి దూసుకెళింది. ఈ సంఘటన సీరోలు మండలంలోని కొత్తూరు(సీ) శివారు గుజిలి తండా వద్ద 365 జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కొత్తూరు(సీ) గ్రామానికి చెందిన నాంపల్లి వంశీ, తోట నవీన్ బైక్‌పై కురవి నుంచి కొత్తూరు(సీ) గ్రామానికి వస్తున్నారు. గుజిలి తండా వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న గేదెను బైక్ ఢీకొట్టింది. దీంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. గేదెను ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న వంశీ, నవీన్‌లు కిందపడిపోగా తీవ్రంగా గాయపడ్డారు. తీవ్రగాయాలైన వీరిని ఒక కారులో మానుకోటకు తరలించారు. బైక్ గేదెను ఢీకొట్టిన సంఘటనను చూసేందుకు తండావాసులు, మరికొందరు వచ్చి రోడ్డు పక్కన నిలుచున్నారు. ఈ క్రమంలో కురవి నుంచి వస్తున్న ఆటో రోడ్డుపై చనిపోయి ఉన్న గేదెను ఢీకొట్టి పల్టీకొట్టింది. రోడ్డు పక్కన నిలుచున్న వ్యక్తుల మీదకు దూసుకెళ్లింది. రోడ్డు పక్కన నిల్చున్న గుజిలితండాకు చెందిన జాటోత్ తులిస్యాకు తీవ్రగాయాలయ్యాయి. తండావాసులు వెంటనే 108కి సమాచారం అందించడంతో అక్కడికి వచ్చిన వాహనంలో గాయాలైన తులిస్యాను మానుకోట జనరల్ ఆసుపత్రికి తరలించారు. తులిస్యా పరిస్థితి విషమంగా ఉన్నట్లు 108 ఈఎంటీ గాంధీ, పైలట్ జక్కుల వీరన్న తెలిపారు.

రైతు సమస్యలు పరిష్కరించాలని ధర్నా


ధర్నా చేస్తున్న రైతులు, నాయకులు

బయ్యారం: వానాకాలం పంటలసాగు సందర్భంగా రైతాంగం ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో శనివారం బయ్యారంలో ఆందోళన నిర్వహించారు. మండల కేంద్రంలో ప్రదర్శన నిర్వహించిన అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఏఐకేఎంఎస్ రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పంటల సీజన్ ప్రారంభమైనందున రైతుల రుణాలను మాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రంను డిప్యూటీ తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, మురళి, నారాయణ, హోలి, శంకర్, రవి, రమేష్, సహదేవ్, హుస్సేన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో అనేక సౌకర్యాలు


దంతాలపల్లి: బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మహబూబాబాద్ రూరల్: ప్రభుత్వ బడుల్లో అన్ని సౌకర్యాలు ఉంటాయని అమనగల్ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని అమనగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఒకేరోజు 30మంది విద్యార్థులు చేరారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్‌ఎం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అనేక రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సత్యశంకర్, డానియల్, పాహిం, శశిధర్, జనార్దన్, బలాస్టి రమేష్, యుగేందర్, బాలాజీ పాల్గొన్నారు.

దంతాలపల్లి: ప్రభుత్వ పాఠశాలలు అమ్మఒడి లాంటివని హెచ్‌ఎం వేణుమాధవరెడ్డి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీదేవి, స్టాఫ్ సెక్రటరీ సురేంద్రగుప్తా పాల్గొన్నారు.

కృషి, పట్టుదలతో చేసినప్పుడే విజయం


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పెద్దవంగర: మనం చేస్తున్న పనిని ఆస్వాదిస్తూ కృషి, పట్టుదలతో పని చేసినప్పుడే ఉన్నత లక్ష్యాలను విజయం సాధిస్తామని మండల నోడల్ అధికారి బుదారపు శ్రీనివాస్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో విద్యార్థులు వ్యాఖ్యాతలుగా, నృత్య కళాకారులుగా, నాటికలు, కథలు, కవితలు, ఆటపాటల కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువులపై దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో మంచి బోధనతో పాటు సకల సౌకర్యాలు ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. అంతకు ముందు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థి తిమ్మిడి సాయికుమార్‌ను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజలింగం, సదయ్య, అంజయ్య, తఖీపాషా, గౌరీశంకర్, శ్రీధర్, షౌకత్ అలీ, సువర్ణ పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న నాయకులు

మహబూబాబాద్ రూరల్/డోర్నకల్/బయ్యారం/దంతాలపల్లి: తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పుట్టినరోజు వేడుకలను జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శాగంటి సందీప్, జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల చరణ్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు బల్లెం చంటి రమేష్ నాయక్, డోర్నకల్ పట్టణ అధ్యక్షుడే కాలా సుమేర్‌చంద్‌జైన్, దాసరి నానియాదవ్, మాదా శ్రీనివాస్, విజయ్ పాల్గొన్నారు. దంతాలపల్లి మండలం దాట్ల గ్రామానికి చెందిన యువజన నాయకులు సంపెట సురేష్ గౌడ్, గణగాని రమేష్ గౌడ్ హైదరాబాద్‌లోని ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టివిక్రమార్కను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

రూ.1.37లక్షల ఆర్థికసాయం



కురవి: మండల కేంద్రంలో తల్లిని కోల్పోయి అనాథగా మారిన బాలిక మానసకు శనివారం టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్ రూ.1.37లక్షల ఫిక్స్ డిపాజిట్ పత్రాన్ని అందజేశాడు.

గోపాలపురంలో..

గార్ల: మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన నిరుపేద కొప్పుల వెంకటయ్య(64) శనివారం మృతి చెందాడు. మృతుడి దహన సంస్కారాల కోసం బాధిత కుటుంబసభ్యులకు గ్రామస్తులు రూ.17,400 ఆర్థికసాయం చేశారు.

సంగీత దర్శకుడు చక్రికి నివాళి



మహబూబాబాద్ రూరల్: సినీ కళామతల్లి ముద్దుబిడ్డ సంగీత దర్శకుడు జిల్లా చక్రధర్ (చక్రి) అని మానుకోట మున్నూరుకాపు పటేల్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల శ్రీకాంత్ అన్నారు. చక్రి జయంతిని పురస్కరించుకుని మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి గ్రామంలోగల చక్రి విగ్రహానికి శనివారం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొలిశెట్టి సత్యనారాయణ, పిట్టల చంద్రశేఖర్, రావిశెట్టి చంద్రశేఖర్, చెవ్వ చిరంజీవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధికి కృషి

మరిపెడ: సమాజ అభివృద్ధికి వాసవీ క్లబ్ ముందు వరుసలో ఉంటుందని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గర్రెపల్లి వెంకన్న, విజయకుమార్ అన్నారు. శనివారం మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో క్లబ్‌లో ఏర్పాటు చేసిన డాన్ టు డస్క్ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గార్లపాటి బ్రహ్మనందం, గుమ్మడవెల్లి నారాయణ, రీజియన్ చైర్మన్ వంగవీటి భద్రయ్య హాజరుకాగా పలు సేవ కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. అనంతరం బీద ఆర్యవైశ్యులకు తోపుడు బండ్లను, 100 మంది విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐపీసీలు బోనగిరి సురేష్, వంగపల్లి భరత్, ఎర్రబెల్లి జానకీరాములు, నాగయ్య, నర్సయ్య, సురేష్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి

చిన్నగూడూరు: ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీడీఓ రామారావు, ఎంపీఓ యాకయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎకో క్లబ్ కార్యక్రమం భాగంగా అధికారులు ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీఓ మాధవి, ఉపాధ్యాయులు రెహమాన్, కొలిపాక శ్రీనివాస్, సతీష్ కుమార్, నాగేశ్వరరావు, సోనీ, నాగుల్‌మీరా, విద్యార్థులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



డోర్నకల్: స్థానిక తహసీల్‌దారు కార్యాలయంలో శనివారం కల్యాణలక్ష్మి చెక్కులను మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, వైస్ ఎంపీపీ తుమ్మ వెంకటరెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణవేణి, నాయకులు సుమేర్‌చంద్‌జైన్, మాదా శ్రీనివాస్, భద్రు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

మరిపెడ రూరల్: మరిపెడ మండలానికి చెందిన గిరిజన బాలికను హైదరాబాద్ మియాపూర్‌లో అత్యాచారం చేసి, హత్యచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి హరినాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఈమేరకు మండలంలోని లక్ష్మాతండాలో బాధిత కుటుంబాన్ని శనివారం కలసి వారిని పరామర్శించారు. దోషులను గుర్తించి బహిరంగా ప్రదేశంలో ఉరి తీయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం డోర్నకల్ నియోజక వర్గ నాయకులు కిషన్, దేవానాయక్, అనిత, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



మహబూబాబాద్ రూరల్: మండలంలోని రెడ్యాల గ్రామానికి చెందిన దేశెట్టి భాగ్యమ్మ, సామ వెంకట్ రెడ్డి మృతిచెందగా ఇరువురి బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి శనివారం పరామర్శించారు. వారి వెంట టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కల ఉదయ్ చందర్, మండల అధ్యక్షుడు మిట్టకంటి రాంరెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఖలీల్, తదితరులు ఉన్నారు.

శంకర్‌నాయక్ పరామర్శ..

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ దీకొండ ఐలయ్య(72) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈమేరకు మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, ఓదార్చారు. అయన వెంట మాజీ ఎమ్మెల్సీ గండి సావిత్రమ్మ, కేసముద్రం సొసైటీ చైర్మన్ దికొండ వెంకన్న, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బేతమళ్ల చంద్రయ్య, మండల ప్రధాన కార్యదర్శి కముటం శ్రీనివాస్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మహేందర్‌రెడ్డి, రామ్మూర్తి ఉన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



మహబూబాబాద్: జీపీ సిబ్బంది పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు చాగంటి వెంకటయ్య, కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. సీఐటీయూ అనుబంధ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. 18 నెలలుగా వేతనాలు రాక సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు సమ్మెట రాజమౌళి, నాగన్న, అప్పిరెడ్డి, సుధాకర్, లతీఫ్, వెంకన్న, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.